## కారును ఢీకొన్న టిప్పర్.. ముగ్గురు మృతి



సమీర్, ఫాతిమా, షెహజాదీబేగం



అబ్దుల్లాపూర్‌మెట్, మే 8 ప్రభాతవార్త: కారును టిప్పర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు చిన్నారులతో పాటు మహిళ మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద గ్రామానికి చెందిన హనీఫా, ఫిరోజుద్దీన్‌ల కుమార్తె షెహజాదిబేగం(35) బలిజగూడ సమీపంలోని ఒక ఫాంహౌజ్‌లో సూపర్ వైజర్‌గా పనిచేస్తోంది. వేసవి సెలవులు రావడంతో పది రోజుల క్రితం రెండవ సోదరి కుమారుడు సమీర్(9), మరో సోదరి కుమార్తె ఫాతిమా(5)లు బలిజగూడకు వచ్చారు. ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో షెహజాది బేగం పిల్లలు ఇద్దరిని తన స్విఫ్ట్ డిజైర్ కారులో తీసుకుని పెద్దఅంబర్‌పేటలోని ఏ1 బేకరీ వద్దకు వెళ్లింది. రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా... ఎల్.నగర్ కమాన్ వద్ద వీరి కారును ఎదురుగా వేగంగా వస్తున్న టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షెహజాది బేగం, సమీర్‌లు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా... ఫాతిమాను చికిత్స కోసం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మల్లాపూర్ స్వర్ణ వైన్స్‌లో విద్యుత్‌షాక్

**కాలిబూడిదైన రూ.కోటిన్నర మద్యం బాటిళ్లు, ఇతర వస్తువులు**

నాచారం, మే 8 ప్రభాతవార్త: మల్లాపూర్ ప్రధాన రోడ్డులో ఉన్న స్వర్ణ వైన్స్‌లో తెల్లవారుజామున విధ్యుత్ షాక్ సంభవించడంతో విలువైన మద్యం బాటిల్స్,ఇతర విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గంగాధర్ రెడ్డి, బాదితుల కథనం ప్రకారం.. మల్లాపూర్ రోడ్డుపై రవికిషోర్ గౌడ్ స్వర్ణ వైన్స్‌ను గత కొంతకాలంగా నిర్వహిస్తు న్నాడు. షాపు రాత్రి మూసిన తరువాత అందులో పనిచేసే సిబ్బంది వైన్ షాప్‌పైనే ఉంటారు. తెల్లవారు జామునవారు నిద్రిస్తున్న సమయంలో కిందిభాగంలో ఉన్న షాపులో విధ్యుత్ షాక్ వచ్చింది. దీంతో వైర్ల ఉండా పక్కనే ఉన్న మద్యంబాటిల్స్‌కు, అట్టపెట్టెలకు, రిఫ్రిజిరేటర్లకు మంటలు అంటుకొని షాపు నిండా మంటలు వ్యాపిం చాయి. దీంతో దట్టమైన పొగ, మంటలు చూసిన పక్కవారు పైన ఉన్న సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు యజమానికి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది మంటలంటుకున్న షాపులో మంటలను ఆర్పారు. అప్పటికే వస్తువులను కాలి బూడిద య్యాయి. షాపులో మొత్తం రూ.కోటిన్నర మద్యం బాటిల్లు ఇతర వస్తువులు కాలిపోయాయని బాదితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

**అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత ఆదేశం**

**మూడేళ్ల తర్వాత మళ్లీ ప్రారంభమైన ప్రజావాణి**



ఫిర్యాదులు స్వీరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత తదితరులు

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాల్సి దిగా జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి 30ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా వల్లగత 3సంవత్సరాల నుంచి నిర్వహించని ప్రజావాణి మళ్ళీ ప్రారంభించినట్లు తెలిపారు. వివిధ సమస్యల పరిష్కార నిమిత్తం ప్రజలు సమర్పించే దరఖాస్తులపై అధికారులు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కారిస్తే బాగుంటుందని సూచించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే వాటిని జాప్యం చేయకుండా తక్షణమే నివేదించి వాటిని సైతం పరిష్కరించాలని తెలిపారు. ఆయా ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా సమస్యల పరిష్కారం అయ్యేవరకు సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. చాలారోజుల తర్వాత ప్రజావాణి నిర్వహించడం పట్ల ఫిర్యాదు దారులు హర్షం వ్యక్తం చేశారు.

### దుండిగల్ పిఎస్ పరిధిలో

## వ్యక్తి దారుణ హత్య

**డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో ఆధారాల సేకరణ**





వెంకటేశ్‌గౌడ్ మృతదేహం, మృతుడి పాతచిత్రం

దుండిగల్, మే 8 ప్రభాతవార్త : గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ గ్రామానికి చెందిన ఈదులకంటి వెంకటేశ్‌గౌడ్(46)మంజుల దంపతులు. వీరికి ఇద్దరు సంతానం కలరు. వెంకటేశ్‌గౌడ్ సెంట్రింగ్ సామాన్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో డి.పోచంపల్లి పరిధి కుండికుంట చెరువు చెట్ల పొదల మాటున ఓ వ్యక్తి రక్తపుమడుగులో విగత జీవిగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడు దుండిగల్‌కు చెందిన వెంకటేశ్‌గౌడ్‌గా గుర్తించారు. ముందురోజు రాత్రి హత్యకు గురై ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తును చేపట్టారు. హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణం అయి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు మల్లేష్

మలక్‌పేట, మే 8 ప్రభాతవార్త : ఆస్తి వివాదంలో తమ్ముడిని హత్య చేసిన అన్నను అరెస్టు చేసిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి కథనం ప్రకారం అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన అశోక్ తన మొదటి భార్య సుమతి 1998లో చనిపోవడంతో బాలమణిని 2వ వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య సుమతికి ఒక కుమారుడు మల్లేష్ (34) ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 2వ భార్య బాలమణికి ఒక కుమారుడు నవీన్ ఉన్నాడు. 2017లో మల్లేష్ వివాహం చేసుకుని ఉప్పల్‌లో నివసిస్తున్నాడు. రామంతాపూర్‌లో ఒక టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేయగా నష్టం వచ్చింది. దీంతో అప్పులు అయ్యాయి. మరలా అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లోని తండ్రి అశోక్ నివాసానికి వచ్చి పై అంతస్తులో నివసిస్తున్నాడు. గ్రౌండ్ 2వ భార్య బాలమణి కుమారుడు నవీన్ కుటంబ సభ్యులతో కలిపి అశోక్ నివసిస్తున్నాడు. అంబర్‌పేటలో ఇంటిని అమ్మి అప్పులు తీర్చాలని భావించిన మల్లేష్ తన తండ్రి అశోక్‌ను ఒత్తిడి చేయగా నిరాకరించాడు. అనంతరం మల్లేష్ సోదరి ఉషారాణి ఇంటిలో తనకు భాగం ఇవ్వాలని సివిల్ కేసు వేసింది. దీంతో తండ్రి అశోక్ ఇంటిని అమ్మడానికి అంగీకరించాడు. ఇట్లు అమ్మగా వచ్చిన డబ్బులో రూ. 50 లక్షలు తనకు ఇవ్వాలని, మిగిలిన డబ్బును మల్లేష్‌కు ఇస్తానని చెప్పడంతో మల్లేష్ అందుకు ఒప్పుకోలేదు. తన తమ్ముడు నవీన్‌ను అంతమొందిస్తే తన తండ్రికి చెందిన ఆస్తి మొత్తం తనకే దక్కుతుందని భావించాడు. కాగా ఈ నెల 6వ తేదీన మలక్‌పేట మున్సిపల్ కాలనీలో పిండి గిర్ని నిర్వహిస్తున్న తండ్రి అశోక్‌కు లంచ్ బాక్స్ ఇవ్వడానికి వెళుతున్న నవీన్‌ను పిలిచి తను కూడా వస్తానని, ఆస్తి విషయం తండ్రితో మాట్లాడుతామని మల్లేష్ చెప్పి ఇద్దరూ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నవీన్ వాహనాన్ని నడుపుతుండగా మల్లేష్ వెనుకవైపు కూర్చున్నాడు. మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ సుబ్బయ్య హోటల్ వెనుకవైపుకు రాగానే ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మల్లేష్ తన వెంట తెచ్చుకున్న పేపర్ కటింగ్ బ్లేడ్‌తో నవీన్ గొంతు కోసి హత్య చేసాడు. మల్లేష్ వెంటనే పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మల్లేష్‌ను అంబర్‌పేట గోల్నాక బ్రిడ్జి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి రమేష్‌కుమార్ పర్యవేక్షణలో మలక్‌పేట ఎసిపి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ వై.ప్రకాష్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# హైదరాబాద్ వార్త



## ప్రియాంక రాకతో కాంగ్రెస్ నేతల్లో జోష్

**యువ సంఘర్షణ సభ సక్సెస్ ● సరూర్‌నగర్‌సభకు భారీగా హాజరైన జనం**

హైదరాబాద్, జూన్ 8,ప్రభాతవార్త: వచ్చే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో పాగా వేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన యువసంఘర్షణ సభ సక్సెస్ అయ్యింది. సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసిసి జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఈసభకు రావడంతో నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఆశించిన దానికంటే ప్రజలు అధికంగా తరలిరావడంతో పార్టీశ్రేణుల్లో జోష్‌నింపింది. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ ప్రకటించిన సందర్భంలో ప్రజలనుంచి విశేషమైన స్పందన వచ్చింది. మహిళా సాధికారతపై ప్రత్యేక ఫోకస్ చేసిన కాంగ్రెస్ చదువుకునే యువతులకు, ఎలక్ట్రికల్ స్కూటర్లు అందిస్తామని అలాగే యువతకు ఉపాధి కల్పించేవరకు ప్రతినెలా 4వేల రూపాయల నిరుద్యోగ భృతి అందిస్తామని తెలిపారు. కాగా అంతకు ముందు స్టేడియం ముందు పిసిసి ఛీఫ్ రేవంత్‌రెడ్డి డ్రైవర్‌కు పోలీసులకు మధ్యవాగ్వాదం చోటు చేసుకుంది. కార్ డోర్ తీసి డ్రైవర్‌పై పోలీసులు చేయిచేసుకున్నారు. అతన్ని బయటకు లాగే ప్రయత్నం చేశారు. పోలీసులు దాడి చేసే సమయంలో రేవంత్‌రెడ్డి కార్లో లేకపోవడంతో పోలీసులు డ్రైవర్‌పై అత్యుత్సాహం ప్రదర్శించారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.



ప్రియాంకా గాంధీకి మెమెంటోను అందజేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



గాంధీ వేషధారణతో ఓ వృద్ధుడు

## బెంగుళూరు నుంచి బేగంపేట చేరుకున్న ప్రియాంక గాంధీ

**విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన నేతలు**

**విమానాశ్రయం నుంచి సరూర్‌నగర్‌కు హెలిక్యాప్టర్‌లో వెళ్లిన ప్రియాంక**

బేగంపేట.. సరూర్‌నగర్‌లో తెలంగాణా కా ంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంఘర్షణ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియా ంక గాంధీ సోమవారం సాయంత్రం గం 6.46నిలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ టి.జయ, టీపీసీసీ వైస్ ప్రసిడెంట్ నిరంజన్, పీసీసీ ఉపాధ్యక్షులు ప్రోగ్రాం కోఆర్డినేటర్ హెచ్.వేణుగోపాల్, ఫహీమ్ ఖురేషి, ఉషా, సురభి రవి శంకర్ ద్వివేది, పుట్టి రమేష్‌బాబు, టి.సాగరిక, అక్షయ్‌లక్రా, జి.హరీష్‌లు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రియాంక గాంధీ బేగంపేట విమానాశ్రయం నుంచి హెలిక్యాప్టర్‌లో సరూర్‌నగర్‌కు బయలు దేరి వెళ్లారు. అనంతరం సాయంత్రం కావడంతో ఆమె సరూర్ నగర్ సభా ప్రాంగణం నుంచి రోడ్డు మార్గంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రియాంక గాంధీకి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు. ప్రియాంక గాంధీ రాక సందర్భంగా బేగంపేట విమానాశ్రయంలో పటిష్టమైన భద్రతను పోలీసులు ఏర్పాటు చేసారు.

## నీటి సంపులో పడి మహిళ దుర్మరణం

**జూబ్లీహిల్స్ కార్మిక నగర్‌లో విషాదం**

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ కార్మికనగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి మహిళ మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో నాళ్లు రాకపోవడంతో సంపుప మూత తెరిచిన మహిళ ప్రమాద వశాత్తు అందులో పడింది. ఇంటి ఆవరణలో ఉన్నప్పటికీ ఆలస్యంగా గుర్తించడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు పోలీసులు సమాచారం అందించగా ఆమె ఇంటికి చేరకుని సంపులోంచి బయటకు తీశారు. దీంతో మహిళ కుటుంబంలో విషాదం నెలకొంది.

## వృద్ధుడు అదృశ్యం



పేట్‌బషీరాబాద్, మే 8 ప్రభాతవార్త: ఇంట్లో నుంచి బయటకు వెళ్ళిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చింతల్ పద్మానగర్ ఫేజ్2, కృష్ణ చైతన్య టవర్స్, ప్లాట్ నెం530లో నివాసం ఉం టున్న వి.సత్యనారాయణ(55) ఇంటి వద్దనే ఉంటున్నాడు. గత నెల ఏప్రిల్ 26న తెల్ల వారు జామున నిద్రలేచి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సత్యనారాయణ ఆచూకి కోసం చుట్టుపక్కల, బంధువులు తెలిసినవారి ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో కుమారుడు నాగార్జున సోమవారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వణికిస్తున్న విష జ్వరాలు!

**ఆసుపత్రుల్లో పెరుగుతున్న బాధితులు**

**ఇంట్లో ఒకరి నుంచి ఒకరు అస్వస్థత**

**ముందస్తు జాగ్రత్తతోనే నివారణ సాధ్యం**



హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త : నగరంలో మారిన వాతావరణంతో ప్రజలు చలి, జ్వరం,వాంతులు, వినోదనాలు, దగ్గు, జలుబు, ఒళ్లనొప్పులతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. నగరవ్యాప్తంగా వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లూయెంజా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ప్రతి ఇద్దరు రోగుల్లో ఒకరు దగ్గు, జలుబు, వైరల్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారని ఫీవర్ ఆస్పత్రి వైద్యవర్గాలు పేర్కొంటున్నారు.ఎక్కువ మందిలో 102 పారన్‌హీట్ వరకు తీవ్ర జ్వరం ఉంటోంది. 2-3 వారాల వరకు దగ్గు, తీవ్రమైన నీరసం వేధిస్తున్నాయి. ఇంట్లో ఒకరి నుంచి ఒకరు అస్వస్థతకు గురవుతున్నారు.చిన్నపిల్లలు కూడా తీవ్ర జ్వరం దగ్గు, గొంతు నొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు సులువుగా ఇన్‌ఫెక్షన్ బారిన పడుతున్నారు. తొలుత గొంతునొప్పి తర్వాత ఒక్కసారిగా జ్వరం పెరుగుతోంది. రెండు రోజుల్లో జ్వరం తగ్గినా దగ్గు తీవ్ర నీరసం మాత్రం కొనసాగుతోంది. అస్తమా, అలర్జీ, ఇతర ఊపిరితిత్తుల సమస్యలున్న వారిలో సమస్యలు మరింతగా పెరుగుతున్నాయి. ఫీవర్ ఆస్పత్రి, గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. సాధారణ రోజుల్లో ఫీవర్ ఆస్పత్రిలో 600-700 మంది వరకు ఔట్‌పేషెంట్లుగా నమోదు అయ్యేవారు. సోమ, శనివారాల్లో ఓపి వెయ్యి మంది దాటుతున్నారు. వారిలో ఎక్కువగా దగ్గు, ఆయాసం, గొంతు నొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

దీంతో చాలా మంది యాంటీబయోటిక్స్ తీసుకుంటున్నారు. బాధితుల్లో పిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారే ఎక్కువగా ఉంటున్నారని ఫీవర్ ఆస్పత్రివర్గాలు వివరిస్తున్నారు. కోవిడ్ వ్యాప్తి తగ్గడంతో ప్రజలు మాస్క్ వాడకాన్ని దాదాపుగా మర్చిపోయారని, రద్దీ ప్రాంతాల్లోనూ ఎవరూ పెద్దగా మాస్క్ వాడటంలేదని విశ్లేషిస్తున్నారు. అందుకే వైరల్ జ్వరాలు ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపిస్తున్నాయని వైద్యులు అంటున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

మరోవైపు రోడ్లపై మురుగునీరు నిలిచి, చెత్తాచెదారం పేరకుపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రేటర్‌లో కొంత కాలంగా డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య అధికమవుతుంది. దోమల నియంత్రణకు పగడ్బంధీగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఆదివారం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందోళనకరంగా మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మలేరియా డెంగీ,, చికున్‌గున్యా ముప్పు పొంచి ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. న్యూమోనియా, అస్తమా ఇతర శ్వాకోశ వ్యాధులతో ఇబ్బందిపడుతున్న వారిని ఈ వాతావరణం మరింత ఇబ్బందులకు గురిచేస్తుందని అంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, గర్భిణిలు, బాలింతలు ఈ వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాతావరణంలో మార్పులు, పిల్లలు, వృద్ధులు గర్భిణిలు, బాలింతల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. అనారోగ్యంతో ఉన్న వారు త్వరగా వైరస్ బారినపడతారు. వారిలో రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. దీంతో వారు తొందరగా అస్వస్థత పాలవుతారు. తలనొప్పి, కీళ్లనొప్పులు, జుట్టు రాలడం సమస్యలున్న వారిని ఇలాంటి వాతావరణం మరింత ఇబ్బందులకు గురిచేస్తుంది. సైనస్, ఇన్‌ఫెక్షన్లు, ఫ్లూ వంటి ఇబ్బందులున్న వారు మరింత ఇబ్బంది పడతారు.

## ఢిల్లీ మద్యం కుంభకోణం అంతా అబద్దమే

**ఆమ్ ఆద్మీ పార్టీ నేత సుధాకర్**



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

సైఫాబాద్, మే 8 ప్రభాతవార్త: ఢిల్లీ మద్యం కుంభకోణంలో లంచం లేదా కిక్ బ్యాక్ కోసం ఏదైనా నగదు చెల్లింపుకు సంబంధించిన ఏలాంటి సాక్ష్యాలను ఢిల్లీ రూస్ అవెన్యూ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చూపలేకపోయిందని, దీనిని బట్టి మద్యం కుంభకోణం మొత్తం అబద్ధమని తెలిపోయిదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటి తెలిపింది. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ కోర్ కమిటి సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ రాజేష్‌జోషి, గౌతమ్ మల్హోత్రాలతకు రూస్ అవెన్యూ కోర్టు బెయిల్ ఇచ్చిన తరువాత కోర్టులు కూడా ఈ స్కామ్ కల్పితమనే భావనను ప్రతిధ్వనించడం ప్రారంబించాయని చెప్పారు. బడా బందిపోటులైయిన నీరవ్ మోదీ, లలిత్‌మోదీ, మెహుల్ చౌక్సి ప్రజా ధనాన్ని దోచుకుని విదేశాలకు పారిపోయారని అలాంటి వ్యక్తులపై ప్రదాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈడి, సిబిఐ, ఐటి వంటి కే ంద్ర ఏజెన్సీలను ఉపయోగించి కేసులు పెట్టి జైళ్లకు పంపిందని, కేవలం బిజెపి తప్పిదాలను ప్రశ్నించినందుకే ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి గోంతు నోక్కె ప్రయత్నం చేసిందని ఆయన ఆరోపించారు. ఆఫ్ నేతలపై బిజెపి వేదింపులు ప్రతీకార రాజకీయాలు ఆపకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెపుతారని సుధాకర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కోర్ కమిటి సభ్యులు బుర్రా రాముగౌడ్, భూక్యా శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## కలర్ ప్రింటర్‌తో 100 రూపాయల నకిలీ నోట్ల తయారీ

**అమాయక విద్యార్థులే టార్గెట్‌గా నకిలీ సర్టిఫికెట్లు, గంజాయి అమ్మకాలు**

**ముగ్గురు నిందితుల రిమాండ్, పరారీలో మరో ఇద్దరు నిందితులు**



పట్టుకున్న నకిలీ నోట్లతో డీసీపీ సందీప్, పోలీస్ అధికారులు

దుండిగల్, మే8 ప్రభాతవార్త: జల్సాలకు అలవాటుపడి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న ముగ్గరి నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ డీసిపి సందీప్ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల వివరాలను వెల్లడించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి ఓ వీధిలో ఒక వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ ఎస్‌ఓటీ, దుండిగల్ పోలీసులు ఆదివారం సాయంత్రం 5గంటల సమయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సూరారంకు చెందిన మొదటి నిందితుడు యు.బాబురావు(38) ఇచ్చిన సమాధానంపై అనుమానించిన పోలీసులు నిందితుడి ఇంట్లో సోదాలు నిర్వహించగా విస్తుపోయే నిజాలు బయటపడినట్లు డీసీపి తెలిపారు. నిందితుడు బాబు రావు 2015లో ప్రింటర్‌ను కొనుగోలు చేసి పలు యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లను ముద్రించి కూకట్‌పల్లికి చెందిన జూపల్లి నరేంద్ర (19), జురుపాల శ్రీను(23)తో కలిసి అమాయకులను టార్గెట్‌గా చేసుకొని నకిలీ సర్టిఫికెట్లను విక్రయించేవాడు. అంతేకాకుండా పాత 100 రూపాయల నోట్లను యానిమేషన్ ద్వారా కలర్ జిరాక్స్‌తో ప్రింట్ చేసి మార్కెట్లో విక్రయించేవాడు. ఇటీవలే కృష్ణా జిల్లాకు చెందిన మురళి, అరుకుకు చెందిన జాన్ ద్వారా ఆంధ్రా నుంచి గంజాయిని దిగుమతి చేసి విక్రయించడం మొదలు పెట్టాడని పోలీసులు తెలిపారు. నిందితులైన బాబురావు, నరేంద్ర, శ్రీనులను అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితులు మురళి, జాన్‌లు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల నుంచి 34 యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లు, రెండు హార్డ్ డిస్కులు, కలర్ ప్రింటర్లు, సిపీయూ, 3మొబైల్స్, 500గ్రాముల గంజాయి, 111దొంగ నోట్లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, దుండిగల్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఓటీ సీఐరాహుల్, ఎస్‌ఓటీలు, పోలీసులు పాల్గొన్నారు.

### జివో 317 ఉద్యోగుల విభజనలో
# కొందరికి ఉద్యోగులకు అన్యాయం

గన్‌ఫౌండ్రి, మే8(ప్రభాతవార్త): ఫౌరసరఫ రాలశాఖ,తూనికలు, కొలతలశాఖలల్లో ఉన్న ఉద్యోగుల సమస్యలపై ఆశాఖ కమీషనర్ అనిల్‌కుమార్‌తో కలిసి హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ, జిల్లా ఉద్యోగ ప్రతినిధులతో కలిసి చర్చించారు.అనంతరం కమీషనర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ రెండుశాఖల లో పదోన్నతులు కల్పించడంలేదన్నారు. ముఖ్యంగా సాయన్న అనే ఉద్యోగికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జి.ఓ 317 ఉద్యోగుల విభజనలో కొందరికి అన్యాయం జరిగిందని,సర్వీస్ రూల్స్ అమలు కావడం లేదని కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.సాయన్నకు వెంటనే పదోన్నతి కల్పిస్తామని కమీషనర్ హామి ఇచ్చినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,సభ్యులు ఓమేర్‌ఖాన్,కె.శ్రీనివాస్,వైధిక్‌శాస్త్రి,ముఖీమ్‌ఖురేషీ,సాయన్న, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.కాగా అసద్,అన్వర్ మెమోరియల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో సోమవారం క్యాన్సర్ ఆసుపత్రి, వద్ద రోగులకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల నాలుగుసార్లు తల్లిదండ్రుల పేరిట వైద్యం కోసం వచ్చే రోగి సహాయకులకు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు.వైద్యం కోసం సుదూరప్రాంతాలనుంచి వచ్చే రోగి సహాయకులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.


ఫౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందచేస్తున్న డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేన్జీ,జిల్లాప్రతినిధులు

## కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి : బిజెపి కార్పోరేటర్ల ధర్నా


వినతి పత్రాన్ని ప్రదర్శిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

సైఫాబాద్, మే 8 (ప్రభాతవార్త): జిహెచ్‌ఎంసి కౌన్సిల్ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిజెపి కార్పొరేటర్లు ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ లేకుండానే ప్రతిపక్ష బిజెపి కార్పొరేటర్లపై నింద మోపుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించడం ఈ నిర్ణయానికి జిహెచ్‌ఎంసి జోనల్ కమీషనర్ మమత వంత పాడటం దారుణమన్నారు. కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తూ అటు మేయర్, ఇటు కౌన్సిల్ సభ్యులను అవమానపరుస్తూ చట్ట వ్యతిరేక నిర్ణయం తీసుకున్న ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కారానికి, డివిజన్ల అభివృద్ధికి తగినన్ని నిధుల కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రవిచారి, సురేఖ, పద్మా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక సభకు నార్సింగి నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు


నార్సింగి మున్సిపాలిటీ నుంచి ప్రియాంక గాంధీ సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

నార్సింగి, మే 8 (ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకురాలు ప్రియాంక గాంధీ యువ సంఘర్షణ సభకు నార్సింగి మున్సిపాలిటీ నుంచి భారీ ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లారు. పీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హైరదాబాద్‌లోని సభా స్థలికి జై కాంగ్రెస్, జైజై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ వెళ్లారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మరో ఐదు నెలల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, మళ్లీ మన రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకువస్తుందన్నారు. పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని జిల్లాలు, మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మళ్లీ ఉత్తేజితులయ్యారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో అధికార బిఆర్‌ఎస్, బీజేపీలకు చుక్కలు చూపిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగడుగునా నిరుపేదలు, నిరుద్యోగులు, రైతులు, యువకులకు అన్యాయం చేశాయని, వారే మా కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా మారారని, విజయం హస్తానిదేనని జైపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంను ఇచ్చిన సోనియాగాంధీ, యువనేత రాజీవ్‌గాంధీ, ప్రియాంక గాంధీల ప్రచారానికి కర్నాటకలో ప్రజల నుంచి వచ్చిన స్పందన మళ్లీ కాంగ్రెస్ పూర్వ వైభవానికి చేరుతుందనే సంకేతాలు ఇచ్చిందన్నారు.

## అంబర్‌పేటలో వేగంగా రోడ్ల అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


శాంతినగర్‌లో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త : అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, బస్తీల్లోని రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం బాగ్‌అం బర్‌పేట డివిజన్, శాంతినగర్‌లో 15 లక్షల వ్యయంతో నూతనంగా వేయనున్న సిసి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో దశలవారీగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో సిసి రోడ్లు, మంచి నీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ పనులు, వర్షపు నీటి పైప్‌లైన్లు, నాలాల అభివృద్ధి, విద్యుత్ లైన్లు, పార్కుల అభివృద్ధి, సుందరీకరణ వంటి పనులను పెద్దఎత్తున చేస్తున్నామని తెలిపారు. అలాగే పాదయాత్రలు నిర్వహించి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. స్థానికంగా ఎక్కడ సమస్యలు నెలకొన్న తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక గాంధీ సభకు తరలివెళ్లిన నాయకులు

ఖైరతాబాద్, మే 8 (ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీమతి ప్రియాంక గంధీ సభకు కార్పొరేటర్ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి నేతృత్వం లో భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, నిరుద్యోగులు ప్రభృతులు తరలివెళ్లారు. జై..ప్రియాంక గాంధీ.. జై కాంగ్రెస్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు మారుమోగాయి. రాజధాని నగరంలో జరుగుతున్న సభ విజయవంతం అవుతుందని నిరుద్యోగులు, అభిమాన కార్యకర్తలు కొందరు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అండగా ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తంచేశారు. డివిజన్‌లో నియోజక వర్గంగా అభిమానులు కాంగ్రెస్ జెండాలు చేతబూని విజయారెడ్డి నాయకత్వం వర్థిల్లాలి. రాష్ట్ర టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, దేశ నేత ప్రియాంక గాంధీ జిందాబాద్ అంటూ రామదండులా కదిలారు. సుస్థిర పాలన అందించేది, పేదల బతుకులకు అండగా ఉండేది ఒక్క కాంగ్రెస్‌యేనని వారంటున్నారు.

## గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ బిసి సెల్ అధ్యక్షులుగా పి.శంకర్


పి.శంకర్ నియమాక పత్రం అందచేస్తున్న గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్)

గోషామహల్,మే 8 (ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ బిసిసెల్ అధ్యక్షులుగా పి.శంకర్ నియమితులయ్యారు. గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో ఆయనకు నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్)చేతుల మీదుగా నియమాక పత్రం అందచేశారు.తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన నియోజకవర్గం ఇన్‌చార్జ్ నంద కిషోర్‌వ్యాస్‌కు, మంత్రులు కెటిఆర్,శ్రీనివాస్‌యాదవ్, మహమ్మద్‌అలీ,గ్రేటర్ అధ్యక్షులు మాగంటి గోపినాథ్ శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో బేగంబజార్ డివిజన్ బిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ పూజవ్యాస్,బిఆర్‌ఎస్ నాయకులుశైలెందర్ కురమ,పప్పు,శంకర్,అనిత తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయి కమిషనర్‌లను నియమించాలి : ఎ.వెంకటేష్‌ముదిరాజ్

అఫ్జల్‌గంజ్, మే 8 (ప్రభాతవార్త: సమాచార హక్కు,చట్టం కమీషనర్లు లేక పరిష్కారాలు ఆలస్యమవుతున్నాయని సమాచార హక్కు చట్టం,పరిరక్షణ కమిటి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగెండ్ల వెంకటేష్‌ముదిరాజ్ ఆరోపించారు. సోమవారం ఎంజె మార్కెట్ సమీపంలో ఉన్న సమాచార చట్టం కమీషన్ ఆఫీస్ వద్ద ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చినట్లు వంటి సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్రములో నిర్లక్ష్యానికి గురి అవుతున్నట్లు అన్నారు. దరఖాస్తుదారులు కార్యాలయాల్లో ధరఖాస్తు చేసుకోగా, మొదటి ఆపిల్ కూడా సమాచారం ఇవ్వట్లేదని,అలాగే రెండవ ఆప్పీల్ చేస్తే స్టేట్ కమీషన్ ఆఫీసులో కమిషనర్లు లేక ధరఖాస్తులు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే కమీషనర్లను నియమించాలని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కమిటి నాయకులు స్వామి తదితరులు ఉన్నారు.

## యోగాతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, మే 8 ప్రభాతవార్త : మనం ఆరోగ్యంగా ఉండాలంటే తప్పని సరిగా యోగా చేయవలసిన అవసరం ఉందని జిహెచ్‌ఎంసి బిజెపి కౌన్సిల్ విప్,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.పన్నెండు సంవత్సరాలు నుంచి ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్న వివేకానంద యోగా సంస్థ సేవాకు మ్యాట్స్ ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం యోగా చేయటం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉండటంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.యోగా గురువు భద్రయ్య,రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి తోకల సుధాకర్‌రెడ్డి, శోభా, మంగ, బండారి కృష్ణ,సురేష్,మనోజ్, బలరామ్,మను యాదవ్, బిజెందర్, బబ్లూ, జితేందర్‌లు పాల్గొన్నారు.

# చదువుతోనే మనం ఉన్నత స్థానాలకు చేరుకుంటాం

### జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మదన్ మోహన్

నార్సింగి, మే 8 ప్రభాతవార్త : నేటి సమాజంలో చదువుతోనే మనం ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానాలకు చేరుకుంటామని, చిన్నారులంతా ఇష్టంగా చదువుకొని జీవితంలో వృద్ధిలోకి రావాలని హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం హైదర్షాకోట్‌లోని షాడోస్ కుంగ్ ఫూ కరాటే గ్రాండ్ మాస్టర్ పూసపాటి మురళీకృష్ణం రాజు తన వద్ద కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులకు "ప్రతిభా సర్టిఫికెట్ల"ను అందజేశారు. వివిధ పాఠశాలల్లో చదువుకుంటూ 70.నుంచి 100.శాతం మార్కులు సాధించిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చి షాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమానికి మదన్‌మోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు చదువు ప్రాధాన్యత, జీవితంలో మన ఎదుగుదలకు ఎలా ఉపయోగపడుతుంది, మన చదువుల కోసం తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారు తదితర అంశాలను వివరించారు. ఇష్టంగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, అప్పుడే తల్లిదండ్రులు, చదువులు చెప్పి గురువులు సంతోషిస్తారని తెలిపారు. చదువుపై విద్యార్థులకు ఆసక్తిని పెంచేందుకు మాస్టర్ మురళీ కృష్ణం రాజు పడుతున్న తపన అభినందనీయమైందన్నారు. అనంతరం మాస్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలో చదువు మూడో కన్నువంటిందని, చదువలేని వారు కళ్లున్న అంధులతో సమానమని తెలిపారు. ప్రతీ విద్యార్థి 90శాతం మార్కులు తెచ్చుకోవాలన్న పోటీ తత్వాన్ని వారిలో కలిగించేందుకే ప్రతిభా సర్టిఫికెట్లు ఇవ్వడం, సన్మానాలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో షాడోస్ కుంగ్ ఫూ గౌరవ అధ్యక్షులు కిషోర్, సలహాదారులు నర్సిహ్మారెడ్డి, ఉపాధ్యక్షులు నాగరాజు, బ్లాక్‌బెల్టు విద్యార్థులు శ్రీవెన్నెల యాదవ్, శ్రీకృష్ణ యాదవ్, గణేష్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


హైదర్షాకోట్‌లో చదువులో టాపర్లుగా నిలిచిన చిన్నారులకు ప్రతిభా సర్టిఫికెట్లు అందించి అభినందిస్తున్న దృశ్యం


డీసీపీను సత్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి తదితరులు

## క్రీడలను ప్రోత్సహించటం అభినందనీయం

### నాయిని నరసింహారెడ్డి క్రికెట్ లీగ్-2ను వీక్షించిన డీసీపీ జోయెల్ డేవిస్

ధర్నాచౌక్, మే 8, ప్రభాతవార్త: క్రీడలను ప్రోత్సహిస్తూ క్రికెట్ పోటీలను నిర్వహించటం అభినందనీయమని వెస్ట్‌జోన్ డీసీపీ జోయెల్ డేవిస్ అన్నారు. సోమవారం ఉదయం ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలను ఆయన కార్మిక శాఖ అడిషనల్ కమీషనర్ గంగాధర్ తో కలసి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ పోటీలలో పాల్గొన్న యువతను ప్రోత్సహిస్తూ పలు సూచనలు చేశారు. అదేవిధంగా జర్మనికి చెందిన పాట్రిక్, అమీ క్రికెట్ పోటీని చూసి ఆనందంతో నాటు, నాటు పాటకు డాన్స్ చేసి సందడి చేశారు. సోమవారం క్రికెట్ పోటీలు అబ్బాస్ సీసీ వర్సెస్ రెడ్‌హిల్స్ లెవెన్‌కు, పుష్ప జూనియర్స్ వర్సస్ స్కై లెవెన్ లకు సోమవారం పోటీలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ తరఫున ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరెడ్డి ఘనంగా సత్కరించారు.

## బిజెపి హయాంలోనే దేశం అభివృద్ధి

చార్మినార్, మే 8 ప్రభాతవార్త : కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను చార్మినార్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు,మాజీ బిజెపి మైనార్టీ మోర్చ అధికారి ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మీర్ బాసిత్ అలీ బాక్రీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హయాంలోనే దేశం అన్ని రంగాలలోను అభివృద్ది చెందిందని తెలిపారు.

## గురుకుల టీచర్స్ ఎగ్జామ్స్‌కు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విద్యార్థులకు అవకాశం ఇవ్వాలి

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త: ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ లోయర్ అండ్ హయ్యర్ ఎగ్జామ్ పూరినత చేసుకుని ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టెక్నికల్ సర్టిఫికేట్ ట్రైనింగ్‌లో ఉన్నటువంటి విద్యార్థులందరికీ గురుకుల టీచర్స్ నోటిఫికేషన్‌కు అప్లై చేసుకునే అర్హత ఇవ్వాలని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ ప్రెసిడెంట్ గద్దం రాము డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పలువురు విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేస్తున్న గురుకుల టీచర్ల నియామకాల్లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగానికి సంబంధించి అప్లై చేసుకునే నాటికి సంబంధిత అర్హత సర్టిఫికేట్ కలిగి ఉండి, కోర్సులు పూర్తి చేయాలనే నిబంధనలు పెట్టారన్నారు. నిజానికి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ సంబంధించిన అభ్యర్థులందరూ 2019 నుంచి డ్రాయింగ్ లోయర్ అండ్ హయ్యర్, క్రాఫ్ట్ అభ్యర్థులు కూడా విద్యార్హతకు సంబంధించిన అన్ని అర్హత పరీక్షల్లో పాసై ప్రభుత్వం నిర్వహించే ట్రైనింగ్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం నిర్వహించాల్సిన ట్రైనింగ్ 2019 నుంచి కరోనా కారణంగా నిర్వహించేలదని ఇటీవల మేనెలలో ట్రైనింగ్ ఇస్తున్నప్పటికీ పైన చెప్పిన నిబంధన ప్రకారం అర్హత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కావున సిఎం కెసిఆర్, మంత్రి సబితాఇంద్రారెడ్డి తదితరులు స్పందించి అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నవీన్, సుప్రజ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గజవాహన సేవలో ఊరేగిన శ్రీనివాసుడు

చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి గజవాహన సేవలో ఊరేగారు. పాంచరాత్రాగ శాస్త్రోక్తంగా ఉత్సవాలను ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు జి.శ్రీనాథ్ గౌడ్‌దంపతులు, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, హావనం కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కాగా ఉదయం పథాధివాసము, హావనము, అనంతరం భేరిపూజ, దేవతాహ్వానము, హావనము, బలిహరణము, శేషవాహనసేవ నిర్వహించారు. కాగా మంగళవారం పల్లకీసేవ, స్వామివారికి ఎదురుకోళ్లు అనంతరం కల్యాణ మహోత్సవం ఉంటుందని ఈవో రామాంజనేయులు వివరించారు.

## ఉచిత కాలిగ్రఫీ శిక్షణ తరగతులు

హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త: జీవిఆర్ కరాటే అకాడమిలో 15 రోజుల పాటు ఉచిత కాలిగ్రఫీ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని అకాడమి డైరెకర్ డాక్టర్ జిఎస్.గోపాల్‌రెడ్డి వివరించారు. 10 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వరకు బాలబాలికలకు ఈ తరగతులను బాల్‌బాడ్మిటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీ బోర్డు డైరెక్టర్ వేమూరి తాండవకృష్ణ ఇస్తారని, ఇతర వివరాలు పొంది పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు.

## తెలంగాణ ఈఎస్ఐ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావం


కమిటీనీ ప్రకటిస్తున్న ఈఎస్ఐ ఉద్యోగులు

నాచారం, మే 8 ప్రభాత వార్త: తెలంగాణ రాష్ట్ర ఈఎన్ఐలో ఉన్న ఉద్యోగ సంఘాలైన టీజీజీఓఏ, టీఎన్జీవో, టీజీఎంఈవి, బీఆర్‌ఎస్‌కెవి తదితర ఉద్యోగ సంఘాలు కలిసి తెలంగాణ ఈఎస్ఐ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీని సోమవారం ఈఎస్ఐ ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్లో సమావేశమై నూతన నియమించుకున్నారు. అడ్వయిజర్లుగా డా. వెంకటేష్ బాబు, డా.నాగేందర్, ఛైర్మన్‌గా డా. చీమ శ్రీనివాస్, కన్వీనర్లుగా వి.వేణుకుమార్, పి.రాజ్‌కుమార్, కోషాదికారిగా ఎ.వెంకర్ రెడ్డి, వైస్ ఛైర్మన్లుగా డా. ఎన్. సతీష్ కుమార్, ఓంప్రభు, బి.శీనయ్య, బి.శీనయ్య, ధన్‌రామ్, జె.శ్రీనివాస్, కో కన్వీనర్‌గా డా. రవి, గంగాశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పలు తీర్మాణాలు చేశారు. నూతన కమిటీ ప్రతినిధులు కేంద్రప్రభుత్వ ఆధీనంలోని ఈస్ఐసి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ఇఎస్ఐని నిర్వీర్యంచేసేందుకు కృటలు చేస్తుందని దానిని తీవ్రంగా ఖండించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈఎస్ఐనీ తీసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలన్నారు. ఈఎస్ఐ డైరెక్టర్‌ను, డాక్టర్‌ను వెంటనే నియమించాలన్నారు. ఈఎస్ఐలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఈఎస్ఐ హాస్పిటల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సౌకార్యలు, పరికరాలను అందించేందుక కృషి చేయలన్నారు.

## జూన్ 8న నగరంలో లింగాయత్ మహార్యాలీ

### తెలంగాణ రాష్ట్ర లింగాయత్ సమన్వయ సమితి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్లికార్జున్, సంగమేశ్వర్, ఈశ్వరప్ప

హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త: జూన్ 8న తెలంగాణ రాష్ట్ర లింగాయత్ సమన్వయ సమితి ఆధ్వర్యంలో" లింగాయత్ మహార్యాలీ" నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సమితి సభ్యులు కల్వ మల్లికార్జున్ అప్ప, పటోళ్ల సంగమేశ్వర్, వెన్న ఈశ్వరప్ప,అవినాష్‌బోషికర్ తదితరులు హాజరై కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 8న ఉదయం నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ఈర్యాలీ మొదలై ట్యాంక్‌బండ్‌పై గల బసవేశ్వర విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. అలాగే ఎగ్జిబిషన్‌గ్రౌండ్ లో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈర్యాలీలో పాల్గొనడానికి యావత్ తెలంగాణ నలుమూల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్ర నుంచి లింగాయత్‌లు పెద్దసంఖ్యలో హాజరవుతారన్నారు. ఈసమావేశంలో నాయకులు శివకుమార్, శంకర్ పటేల్, బెడికానే హన్మంతు, విజయ్‌కుమార్ పట్నే, సతీష్, పల్లె వీరమణి, సుభాష్, మధు, దినేష్ పాటిల్, శివకుమార్, రాచప్ప రాజేశ్వరి,రేణుక తదితరులు పాల్గొన్నారు.

## చట్టాల పట్ల బాలికలకు అవగాహన కలిగి ఉండాలి

### సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్


కార్యక్రమంలో పాల్గొన్న మెట్రో పాలిటన్ క్రిమినల్ కోర్ట్సు నాంపల్లి సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్

చార్మినార్, మే 8 ప్రభాతవార్త : చట్టాలు పట్ల బాలికలకు అవగాహన కలిగి ఉండాలని మెట్రో పాలిటన్ క్రిమినల్ కోర్ట్సు నాంపల్లి సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. పాతబస్తీ దూద్ బౌలిలోని ఆశ్రిత హోంలో సోమవారం కేరింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన లీగల్ అవేర్‌నెస్ కార్యమ్రానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆమె ఆశ్రిత్ హోంకు చెందిన బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికలు బాల్యం నుంచి మంచి క్రమ శిక్షణతో చదవుకోవాలని తెలిపారు.బాలికలకు తప్పని సరిగా చట్టాలు గురించి తెలిసి ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని,బాలికలు బయటకు వెళ్లె సమయంలో అధైర్య పడకుండ మనోనిబ్బరం కలిగి ధైర్యంగా ఉండాలని ఆమె కోరారు. ఆశ్రిత హోంకు చెందిన బాలికలకు చట్టాలపై అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో కేరింగ్ అండ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ అబ్దుల్ వాసిక్,ఆశ్రిత్ కమ్యూనిటీ కేర్‌కో ఆర్డినేటర్ వి.పర్వతాలు,లీగల్ వాలంటీర్లు ముజీబుద్దీన్,షహీద్ అలీ,మహ్మద్ వాజిద్,ఆశ్రిత హోం సిబ్బంది రామస్వామి,నాగమణితో పాటు పలువురు పాల్గొన్నారు.

# కన్నతల్లులకు వందనం 'మాతృదేవోభవ చిత్రకళా ప్రదర్శన'

### తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాక సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి, మే 8 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, పికాసో ద స్కూల్ ఆఫ్ ఆర్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రదాన మందిరం రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం వద్దనున్న ఫోయెర్‌లో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి రమేష్ నిర్వహణలో సోమవారం ఉదయం పికాసోలో శిక్షణ పొందిన చిన్నారి విద్యార్థులు తమ కళాప్రదర్శన, ప్రతిభను చాటిచెబుతూ అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని మాతృదేవోభవ శీర్షికన చిత్రకళా ప్రదర్శనను కన్నతల్లులకు వందనంగా సమర్పించడం హర్షదాయకమని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. కళలు పిల్లల్లో సృజనాత్మకశక్తిని పెంచుతాయని, ఆధునిక కాలంలో అమ్మ ప్రేమ విలువ తెలుపడం ఎంత ముఖ్యమో దాన్ని చిత్రకళకు జోడించి పికాసో వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి రమేష్ తన శిష్యులకు నేర్పించడం అభినందనీయమని, చిన్నారులు తల్లిప్రేమ తమ చిత్రాల ద్వారా కళ్లకుకట్టినట్లు, హృదయానికి హత్తుకుపోయేటట్టు ప్రదర్శించారని వారి కళాప్రతిభను కొనియాడారు. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ డిఐజి బి.వందన మాట్లాడుతూ ఈ చిత్రకళాప్రదర్శనలోని 30కుపైగా చిత్రాలు పిల్లల్లో నిగూఢంగా ప్రతిభకు నిదర్శనమని, చిత్రాల రంగులు, కంపోజిషన్, ప్రెజంటేషన్‌లు చాలా అద్భుతంగా ఉన్నాయని ఆశీస్సులందిస్తూ రాబోయే రోజుల్లో గొప్పచిత్రకారులుగా పేరొందాలని ఆకాంక్షించారు.


మాతృదేవోభవ చిత్రకళా ప్రదర్శనలోని చిత్రాలు

# అప్పుల బాధ తాళలేక కేబుల్ బ్రిడ్జి మీద నుంచి దూకి ఆత్మహత్య

### దుర్గంచెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం


వెంకటనర్సింహారెడ్డి (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, మే 8 ప్రభాతవార్త : దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు సోమవారం చెరువులో నుంచి వెలికితీశారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని సూర్యాపేట వాసిగా గుర్తించిన పోలీసులు, అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద నుంచి ఈనెల 6వ తేదీన మధ్యాహ్నం 1.50 గంటలకు ఓ గుర్తు తెలియని వ్యక్తి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేబుల్ బ్రిడ్జి మీద ఉన్న పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి లేక్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో లేక్ పోలీసులు, డిఆర్ఎఫ్ సిబ్బంది, మాదాపూర్ పోలీసులు బృందాలుగా ఏర్పడిన ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. కేబుల్ బ్రిడ్జి మధ్యభాగం నుంచి దూకడంతో నీటి లోతు ఎక్కువగా ఉండి ఎంతగా గాలింపు చేపట్టినా మృతదేహం లభించలేదు. చివరికి రెండు రోజుల పాటు పోలీసుల శ్రమకు ఫలితం దక్కి సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని సూర్యాపేట జిల్లా జెజె కాలనీకి చెందిన వెంకట నర్సింహారెడ్డి(31)గా పోలీసులు గుర్తించారు. నర్సింహారెడ్డి గతకొన్ని రోజుల క్రితం కుటుంబంతో నగరానికి వచ్చి అమీర్‌పేటలో నివాసం ఉంటూ అమెజాన్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 6వ తేదీన ఐటిసి కోహినూర్ రోడ్డు వైపు నుంచి కేబుల్ బ్రిడ్జి మీదకు వచ్చిన నర్సింహారెడ్డి తన వద్ద ఉన్న బ్యాగు, చెప్పులను బ్రిడ్జి మీద వదిలిపెట్టి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు సోమవారం మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా నర్సింహారెడ్డి ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని, గతంలో సైతం నర్సింహారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

నాచారం, మే 8 ప్రభాతవార్త: ఉప్పల్ పోలీసులు సకాలంలో స్పందించి ఆత్మహత్యకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని కాపాడిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. ఉప్పల్ కురుమనగర్‌లో నివాసముండే అశోక్(25) అదేప్రాంతానికి చెందిన అనుషా(23) గత ఏడాది కిందటే వివాహం జరిగింది. ఇటీవల వీరిద్దరి మధ్య తరుచు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో విసిగిచెందిన అనుషా భర్తపై ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె భర్త కలత చెందిన తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు వాట్సాప్ ద్వార భార్యకు చెప్పాడు. ఈ విషయాన్ని వెంటనే ఆమె ఉప్పల్ పోలీస్ స్టేషనకు చేరుకొని పోలీసులకు చెప్పింది. దీంతో ఇన్స్‌పెక్టర్ గోవిందారెడ్డి స్పందించి కానిస్టేబుల్ సూర్యప్రకాష్‌కు చెప్పి అతనిని రక్షించాలని ఆదేశించారు. దీంతో ఆయన వెంటనే అతని ఇంటికి వెళ్లాడు. తలుపులు వేసుకొని తీయడంలేదు. దీంతో పోలీసులు తలుపులు పగులగొట్టి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నిస్తున్న అశోక్‌ను కిందకు దింపి కాపాడారు. అనంతరం స్టేషన్‌కు తీసుకెళ్లి బార్యభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సకాలంలో అతిని వద్దకు వెళ్లి ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ సూర్యప్రకాష్‌ను ఇన్స్‌పెక్టర్ అభినందించారు.

